క్లుప్తంగా

దరఖాస్తుల ఆహ్వానం

చాపాడు: మండల కేంద్రమైన చాపాడులోని కస్తూర్బా గాంధీ బాలికల గురుకుల పాఠశాలలో 2025–26 ఏడాదిలో 6, 11వ తరగతిలో చేరేందుకు అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవచ్చని కస్తూర్బా స్పెషలాఫీసర్ నాగలక్ష్మీ తెలిపారు. ఈ నెల 22 నుంచి ఏప్రిల్ 11వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఆన్‌లైన్ కేంద్రాలలో https//apkgbv.apcfss.in// వెబ్ సైట్‌లో దరఖాస్తు చేసుకోవచ్చని వివరించారు. ఇదే క్రమంలో 6, 7, 8, 9, 10, 12వ తరగతులలో మిగిలిపోయిన సీట్ల కోసం కూడా దరఖాస్తు చేసుకోవచ్చని స్పెషలాఫీసర్ పేర్కొన్నారు.

గాలికుంటు వ్యాధికి టీకాలు



పెయ్యదూడకు గాలికుంటువ్యాధి టీకా వేస్తున్న పశువైద్య సిబ్బంది

కాశినాయన : మండలంలోని ఆకులనారాయణపల్లె గ్రామంలో బుధవారం పశువైద్యాధికారి రామారావు ఆధ్వర్యంలో పశువులకు, జీవాలకు గాలికుంటువ్యాధి టీకాలు వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాడి రైతులు, జీవాల రైతులు తమ జీవాలకు గాలికుంటువ్యాధి సోకకుండా టీకాలు వేయించుకోవాలని, దీని వలన వర్షాకాలంలో వ్యాధి రాకుండా ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో పశువైద్య సిబ్బంది పాల్గొన్నారు.

పది పరీక్షా కేంద్రం తనిఖీ



జెడ్పీ హైస్కూల్‌లో పరీక్షా కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న ఆర్డీఓ

బద్వేలు అర్బన్ : స్థానిక జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలోని పదవ తరగతి పరీక్షా కేంద్రాన్ని బుధవారం బద్వేలు ఆర్డీఓ చంద్రమోహన్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. కేంద్రంలోని సీసీ కెమెరాలు, తాగునీటి వసతి సౌకర్యాలను పరిశీలించారు. ఫ్లయింగ్‌స్క్వాడ్, ఇన్విజిలేటర్లు, పోలీసులు పకడ్బందీగా విధులు నిర్వర్తించి ఎటువంటి పొరపాట్లకు తావు లేకుండా చూడాలని సూచించారు. ఎట్టి పరిస్థితుల్లో సెల్‌ఫోన్లు అనుమతించవద్దని, పరీక్షలు సజావుగా నిర్వహించాలని సూచించారు. ఆయన వెంట పరీక్షా కేంద్రం చీఫ్, ఇన్విజిలేటర్లు ఉన్నారు.

రక్తదానం మానవత్వానికి ప్రతీక



రక్తదానం చేస్తున్న విద్యార్థులు

ప్రొద్దుటూరు కల్చరల్ : ఆపదలో ఉన్న వారిని ఆదుకోవడానికి రక్తదానం చేసేందుకు ముందుకు రావడం మానవత్వానికి ప్రతీక అని లేపాక్షి డిగ్రీ కళాశాల రామచంద్రారెడ్డి అన్నారు. స్థానిక లేపాక్షి డిగ్రీ కళాశాలలో జాతీయ సేవా పథకం యూనిట్ 1, 2 విద్యార్థులు బుధవారం సురక్ష రక్త నిధి కేంద్రం ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. 30 మంది విద్యార్థులు రక్తదానం చేశారు. ప్రతి ఒక్కరూ స్వచ్ఛందంగా పాల్గొని రక్తదానం చేసి ప్రాణదాతలు కావాలని పలువురు పేర్కొన్నారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ రాఘవరెడ్డి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అవగాహన



మాట్లాడుతున్న వీబీడీఎస్ కౌన్సిలర్ సురేష్

ప్రొద్దుటూరు కల్చరల్ : సైబర్ నేరాల పట్ల ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకోవాలని వీబీడీఎస్ కౌన్సిలర్ సురేష్ తెలిపారు. స్థానిక నాగార్జున ఐటీఐ కళాశాలలో కళాశాలలో విద్యార్థులకు ఆర్థిక అక్షరాస్యత – సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గుర్తు తెలియని వ్యక్తుల ఫోన్ చేస్తే ఓటీపీని చెప్పొద్దన్నారు. ఏటీఎం పిన్ నంబర్‌ను ఎవరికి చెప్పకూడదని సూచించారు. ప్రతి ఒక్కరూ ఆర్థికంగా ఎదగాలంటే పొదుపు చేయాలని వివరించారు. సుకన్య సమృద్ధి యోజన పథకం, పీఎంజేజేబీవై, పీఎంఎస్‌బీవై పథకాల గురించి తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సుబ్బారావు, విద్యార్థులు పాల్గొన్నారు.

23న దేవర మహోత్సవం

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక కోట వీధిలో ఈనెల 23న ఆదివారం దేవర మహోత్సవం (ముద్ద) నిర్వహిస్తున్నట్లు నిర్వాహకుడు, మాజీ మున్సిపల్ చైర్మన్ ఆసం రఘురామిరెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. చిన్నమ్మ, పెద్దమ్మవార్లను కొలువు దీర్చుతున్నామని ఆయన పేర్కొన్నారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవార్లను దర్శించుకోవాలని కోరారు. ప్రతి ఏడాది ఉగాది ముందు ఆదివారం దేవర మహోత్సవం నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది.

బాబుగారి భరోసా ఎప్పుడో!

- అర్హుల ఖాతాల్లో పీఎం కిసాన్ సొమ్ము జమ
- రాష్ట్ర ప్రభుత్వ సాయం కోసం రైతుల ఎదురుచూపులు
- పెట్టుబడి సాయంగా ఏడాదికి రూ.20 వేలు హామీ
- హామీలు విస్మరించిన చంద్రబాబు



రబీ సాగు చేసేందుకు దుక్కి దున్నుతున్న రైతు

కాశినాయన : గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో ఏటా క్రమం తప్పకుండా వైఎస్సార్ రైతుభరోసా పథకం ద్వారా రైతులకు పెట్టుబడి సాయం అందజేశారు. అర్హత ఉన్న ప్రతి రైతుకు సాయం అందిస్తూ సాగును పండుగలా మార్చారు. ఎన్నికల ప్రచారంలో ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకటించిన సూపర్ సిక్స్ పథకాల్లో రైతుభరోసా ఒకటి. ఖరీఫ్ సీజన్ ముగిసింది. రబీ ప్రారంభమై దాదాపు నాలుగు నెలలు కావస్తోంది. అయినా బాబు గారి భరోసా రైతుల దరి చేరలేదు. ముఖ్యమంత్రి ఇచ్చిన హామీ త్వరగా అమలు చేస్తే సాగుకు సాయంగా ఉంటుందని అన్నదాతలు ఆశగా ఎదురు చూస్తున్నారు.

ఎదురుచూస్తున్న రైతులు

పుడమిపుత్రులు పొలాల బాట పట్టేందుకు సన్నద్ధమయ్యారు. ఒకపక్క అతివృష్టి మరోపక్క అనావృష్టి, చీడపీడలు, నకిలీ విత్తనాలు రైతులను నట్టేట ముంచుతున్నాయి. పచ్చని సిరులు పండించేందుకు ఏటా ప్రభుత్వం అందించే సాయం కోసం రైతులు ఆత్రుతగా ఎదురుచూస్తున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందించే పంట సాగు ఆర్థిక సాయం ఎప్పుడు వస్తుందా అనే అయోమయంలో పడ్డారు. ఈ నేపథ్యంలో ఫిబ్రవరిలో కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన పీఎం కిసాన్ సమ్మాన్‌నిధి నగదు రైతుల ఖాతాల్లో జమ అయింది. కొత్తగా పగ్గాలు చేపట్టిన టీడీపీ ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టోలో ప్రకటించిన విధంగా రైతులకు ఆర్థిక సాయంపై ఇంకా అధికారిక ప్రకటన విడుదల చేయలేదు. రబీ సాగు ప్రారంభించిన రైతులు ప్రభుత్వం అందించే పెట్టుబడి సాయం త్వరగా వస్తే సాగుకు వెసులుబాటుగా ఉంటుందని ఆశగా చూస్తున్నారు. గత ప్రభుత్వం వైఎస్సార్ రైతుభరోసా, పీఎం కిసాన్ సమ్మాన్‌నిధి కలిపి రైతులకు ఏటా రూ.13,500లు మూడు దఫాలుగా అందించేది. దీని వలన పంట పెట్టుబడికి వెసులుబాటుగా ఉండేది. తొలి విడతగా మే నెలలోనే రూ.7,500లు రైతు ఖాతాల్లో జమ చేసేది. దీని వలన చిన్న, సన్నకారు, పేద రైతులకు ఖరీఫ్‌లో పెట్టుబడి చాలా వరకు కలిసి వచ్చేది.

'కూటమి' హామీలు అమలు చేయాలి

మే నెలతో పాటు అక్టోబర్, జనవరి నెలల్లో ఈ రెండు పథకాల నిధులు వారి ఖాతాల్లో పడేది. వైఎస్సార్ రైతుభరోసా తొలి విడతగా రూ.5,500, రెండవ విడత అక్టోబర్ నెలలో రూ.2 వేలు చొప్పున అందించేవారు. కేంద్రం పీఎం కిసాన్ నిధిగా రూ.6 వేలును మూడు విడతలుగా రూ.2 వేలు చొప్పున ఇచ్చేవారు. కానీ రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన విధంగా రైతులకు రూ.20 వేలకు సంబంధించి ఇప్పటి వరకు జీవో విడుదల కాలేదు. రాష్ట్ర ప్రభుత్వం కూడా తమ ఖాతాల్లో పెట్టుబడి సాయం అందించాలని రైతులు కోరుతున్నారు. కొత్త ప్రభుత్వం రైతులకు ఇచ్చిన హామీలను త్వరగా అమలు చేస్తే సకాలంలో పంటలను సాగు చేసుకుంటామని రైతులు అంటున్నారు.

యూనిక్ కోడ్‌తో రైతులకు ఇబ్బందులు

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతులకు 11 అంకెల యూనిక్ కోడ్ ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. అయితే కేవలం పట్టా భూములు కలిగిన రైతులు 1బి, ఆధార్, ఆధార్‌కు లింక్ అయిన ఫోన్‌నెంబర్‌ను తీసుకుని రైతుసేవా కేంద్రాలకు వెళ్లి రిజిస్ట్రేషన్ చేయించుకున్నారు. ఈ యూనిక్ కోడ్ నెంబరు వచ్చిన వారికి మాత్రమే పీఎం కిసాన్, రైతుభరోసా అందుతుందని వ్యవసాయాధికారులు చెబుతున్నారు. అయితే ప్రభుత్వం డీకేటీ భూములు ఆన్‌లైన్ కలిగి ఉండి యూనిక్ కోడ్ కోసం రైతుసేవా కేంద్రాలకు వెళితే డీకేటీ భూములు రిజిస్ట్రేషన్ కావడం లేదని చెబుతున్నారు. యూనిక్ కోడ్ ఆధారంగా పీఎం కిసాన్, రైతుభరోసాకు దాదాపు జిల్లాలో 1.20 లక్షల మంది డీకేటీ భూములు కలిగిన రైతులు అర్హులు కారు. గత ప్రభుత్వంలో డీకేటీ భూములు కలిగి ఉన్న వారికి కూడా రైతుభరోసా, పీఎం కిసాన్ నిధులు అందేవి. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి డీకేటీ భూములు కలిగిన రైతులకు కూడా 11 అంకెల యూనిక్ కోడ్ అందేలా చూడాలని రైతులు కోరుతున్నారు.

అటవీశాఖ నర్సరీకి రక్షణ ఏది?



పూర్తిగా ధ్వంసమైన ప్రహరీ



నర్సరీ లోపలికి దారి ఏర్పాటు చేసుకున్న ఆకతాయిలు

- ఒక వైపు కూలిన ధ్వంసమైన ప్రహరీ
- అసాంఘిక కార్యక్రమాలకు అడ్డాగా అటవీశాఖ స్థలం

ప్రొద్దుటూరు క్రైం : ప్రొద్దుటూరులోని మోడంపల్లె బైపాస్ రోడ్డు వైపు ఉన్న అటవీశాఖ స్థలం అసాంఘిక కార్యక్రమాలకు నిలయంగా మారింది. ఈ స్థలంలో నర్సరీలను ఏర్పాటు చేసి అనేక రకాల మొక్కలను పెంచుతుంటారు. ఇందుకోసం అటవీశాఖ ప్రతి సంవత్సరం రూ. లక్షలు వెచ్చిస్తోంది. నర్సరీకి ఒక వైపు ప్రహరీ లేకపోవడంతో మొక్కలకు రక్షణ లేకుండా పోయింది. ప్రహరీ గోడ సుమారు 15 మీటర్ల వరకు పూర్తిగా ధ్వంసం కావడంతో పశువులు నర్సరీలోకి వెళ్తున్నాయి. దీని వల్ల అనేక మొక్కలు పాడవడమే కాక వాటిని పశువులు తింటున్నాయని నర్సరీల సంరక్షకులు చెబుతున్నారు. పెంచిన మొక్కలు కూడా చోరీకి గురవుతున్నట్లు అక్కడి సిబ్బంది అంటున్నారు. సాయంత్రం సమయాల్లో ఈ ప్రాంతంలో అసాంఘిక కార్యక్రమాలు జరుగుతున్నట్లు స్థానికులు చెబుతున్నారు. అక్కడే ఒక పాడుబడిన భవనం ఉండటంతో పేకాట రాయుళ్ల స్థావరం ఏర్పాటు చేసుకున్నారు. మందు బాబులు సైతం అక్కడే ఉన్న చెట్ల కింద మకాం వేస్తున్నారు. కాగా ప్రహరీ లేకపోవడంతో విలువైన అటవీశాఖ స్థలం కూడా అన్యాక్రాంతమయ్యే అవకాశం ఉంది. అటవీశాఖ అధికారులు చర్యలు తీసుకొని ప్రహరీ నిర్మించాలని ఆ ప్రాంత వాసులు కోరుతున్నారు.

గృహ లబ్ధిదారులకు అదనపు సాయం

పోరుమామిళ్ల : మండలంలో పక్కా గృహాలు మధ్యలో నిలిపిన 307 మందికి ప్రభుత్వ అదనపు సాయం లభించనుందని ఎంపీడీఓ రమణారెడ్డి బుధవారం తెలిపారు. 15 పంచాయతీల్లో 151 మంది బీసీలు, 151 మంది ఎస్సీలు, 5 మంది ఎస్టీలు ఉన్నారని పేర్కొన్నారు. బీసీ, ఎస్సీలకు రూ. 50 వేలు, ఎస్టీలకు రూ. 75 వేలు అదనపు సాయం లభిస్తుందన్నారు. పోరుమామిళ్ల పంచాయతీలో 107 మంది, రంగసముద్రం పంచాయతీలో 74 మంది, మిగతా పంచాయతీల్లో 126 మంది ఉన్నారన్నారు. వీరంతా త్వరితగతిన ఇళ్ల నిర్మాణం పూర్తి చేయాలని సూచించారు.

జీఓ ఇచ్చినా దీక్షలు కొనసాగిస్తాం



దీక్షలు చేస్తున్న పశువైద్య విద్యార్థులు

ప్రొద్దుటూరు రూరల్ : స్టైఫండ్ 50 శాతం పెంచుతూ ప్రభుత్వం జీఓ ఇచ్చినా దీక్షలను కొనసాగిస్తుమని పశువైద్య విద్యార్థులు తెలిపారు. ప్రభుత్వం స్టైఫండ్ పెంచుతూ జీఓ విడుదల చేసిందని దీక్షలను విరమించాలని కళాశాల అసోసియేట్ డీన్ శ్రీనివాసప్రసాద్ పశువైద్య విద్యార్థులకు సూచించారు. అయితే ప్రభుత్వం పెంచిన స్టైఫండ్ సరిపోదని, దీక్షలను కొనసాగిస్తామని పశువైద్య విద్యార్థులు కళాశాల అసోసియేట్ డీన్‌తో పేర్కొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు రాహుల్, తరుణ్ మాట్లాడుతూ గురువారం మంత్రి అచ్చెన్నాయుడుతో పశువైద్య విద్యార్థులకు అపాయింట్‌మెంట్ లభించిందని, ప్రతి ఏటా 10 శాతం స్టైఫండ్ పెంచేలా కోరుతామని తెలిపారు. రాష్ట్రంలో నాలుగు పశువైద్య కళాశాల విద్యార్థులు మంత్రిని కలవనున్నట్లు వారు పేర్కొన్నారు.

ఇన్విజిలేటర్ సస్పెన్షన్

పరీక్షా కేంద్రంలోకి సెల్‌ఫోన్ తెచ్చుకున్నందుకు విద్యార్థి డీబార్

కడప ఎడ్యుకేషన్ : కడప ప్రభుత్వ బాలికల హైస్కూల్‌లో పరీక్షల విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించిన ఇన్విజిలేటర్ ప్రకాష్‌బాబును సస్పెండ్ చేసినట్లు డీఈఓ షేక్ షంషుద్దీన్ తెలిపారు. పెండ్లిమర్రి మండలం జేసీ.పల్లె హైస్కూల్లో ఫిజికల్ డైరెక్టర్‌గా పనిచేస్తున్న ప్రకాష్‌బాబును కడప ప్రభుత్వ బాలికల హైస్కూల్ కేంద్రంలో పరీక్షల విధులకు నియమించారు. ఈ కేంద్రంలో ఒక విద్యార్థి సెల్‌ఫోన్‌ను జేబులో ఉంచుకుని కేంద్రంలోకి వెళ్లినా.. ఆ విషయాన్ని పరిశీలించకుండా పరీక్షకు అనుమతించారు. అదే సమయంలో ఈకేంద్రానికి తనిఖీకి వచ్చిన స్క్వాడ్ బృందం విద్యార్థి జేబులో సెల్‌ఫోన్ ఉండటాన్ని గుర్తించారు. విద్యార్థిని డీబార్ చేసి.. ఆ విషయాన్ని డీఈఓ దృష్టికి తీసుకువచ్చారు. విచారణ అనంతరం విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించినందుకు ప్రకాష్‌బాబును సస్పెండ్ చేస్తున్నట్లు డీఈఓ తెలిపారు.

వ్యవసాయ సిబ్బంది అందుబాటులో ఉండాలి



మాట్లాడుతున్న ఏఓ రామకృష్ణయ్య

గోపవరం : రైతుసేవా కేంద్రాల్లో పనిచేస్తున్న వ్యవసాయ సిబ్బంది రైతులకు అందుబాటులో ఉండాలని మండల ఇన్‌చార్జి వ్యవసాయాధికారి రామకృష్ణయ్య సూచించారు. బుధవారం రాచాయపేట రైతు సేవా కేంద్రంలో వ్యవసాయ సహాయకులు, వ్యవసాయ విస్తరణాధికారులు, ప్రకృతి వ్యవసాయ సిబ్బందికి ప్రస్తుత సీజన్‌లో రైతులు సాగు చేసే పంటలు, సబ్సిడీ ద్వారా ప్రభుత్వం అందించే యాంత్రీకరణ పథకాలపై శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతు సేవా కేంద్రాల్లో పనిచేస్తున్న సిబ్బంది సమయం పాటించాలని, విధినిర్వహణలో అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఎప్పటికప్పుడు పంటల సాగు, ప్రభుత్వం అందించే యాంత్రీకరణ పనిముట్లకు సంబంధించి రైతులకు తెలియజేయాలన్నారు. అవసరమైన రైతులు దరఖాస్తు చేసుకునేలా అవగాహన కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో వ్యవసాయ సహాయకులు ఓబయ్య, బాదుల్లా, విజయ్, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

ఆదరణ పథకాన్ని సద్వినియోగం చేసుకోండి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ సూర్యనారాయణరెడ్డి

ప్రొద్దుటూరు రూరల్ : కులవృత్తుల వారు, కళాకారులు ఆదరణ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ సూర్యనారాయణ రెడ్డి తెలిపారు. మండలంలోని హౌసింగ్ బోర్డులోని ఎంపీడీఓ కార్యాలయ సభాభవనంలో బుధవారం కుల వృత్తులు చేసుకునే వారితో, కళాకారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం కులవృత్తులు చేసుకునే వారికి, కళాకారులకు పనిముట్లను అందిస్తున్నదని తెలిపారు. అర్హులైన వారిని ఎంపిక చేసి జిల్లా ఉన్నతాధికారులకు పంపుతామని ఆయన పేర్కొన్నారు. అర్హత కలిగిన వారు దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

దరఖాస్తుల ఆహ్వానం

చాపాడు : బీసీ కార్పొరేషన్, ఈబీసీ, కమమ, రెడ్డి, క్షత్రియ, బ్రాహ్మణ కార్పొరేషన్లకు సంబంధించిన మహిళలు ఉచిత కుట్టు మిషన్ శిక్షణ కోసం గ్రామ సచివాలయాల్లో దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీఓ వీర కిషోర్ తెలిపారు. ఎంపికైన లబ్ధిదారులకు శిక్షణ అనంతరం 75 శాతం పైగా హాజరు కలిగిన వారికి సర్టిఫికేట్‌తో పాటు ఉచితంగా కుట్టు మిషన్ ఇవ్వడం జరుగుతుందన్నారు. 18–50 ఏళ్ల లోపు మహిళలు బీపీఎల్ కార్డు, ఆదాయ, కుల, ఆధార్ కార్డుతో ఈ నెల 22వ తేదీలోగా ఆన్‌లైన్ దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీఓ కోరారు.

ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా పోరాటం



నిరసన వ్యక్తం చేస్తున్న మాల మహానాడు నాయకులు

ఖాజీపేట : ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా పోరాడుతామని మాలమహానాడు రామోజీ వర్గం ఉపాధ్యక్షుడు గున్నంపాటి వెంకటరమణ తెలిపారు. బుధవారం పుల్లూరులో అంబేడ్కర్ విగ్రహానికి నివాళి అర్పించి.. వర్గీకరణ బిల్లుకు వ్యతిరేకంగా నిరసన చేపట్టారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ రాజకీయ పబ్బం గడుపు కోవడం కోసం దళితుల మధ్య చిచ్చు పెట్టేందుకు కూటమి ప్రభుత్వం ప్రయత్నం చేస్తోందని విమర్శించారు. ఈ కార్యక్రమంలో మాల మహనాడు ఖాజీపేట మండల అధ్యక్షుడు శిఖామణి, ఓబయ్య, శోభన్, రమణ, రాజేష్ పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణపై ప్రభుత్వం పునరాలోచించాలి

బద్వేలు అర్బన్ : ఎస్సీ వర్గీకరణ అంశంలో రంగరాజమిశ్రా ఇచ్చిన నివేదికపై ప్రభుత్వం పునరాలోచించాలని మాలమహాసేన రాష్ట్ర కార్యదర్శి మీసాల రవి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. కులగణన జరగకుండా శాస్త్రీయబద్ధత లేకుండా ఉమ్మడి రాష్ట్రంలో 2011 జనాభా లెక్కల ప్రకారం వర్గీకరణ చేయడానికి కమిషన్ ఆమోదించడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని తెలిపారు. వన్‌మెన్ కమిషన్ నివేదికకు రాష్ట్ర కేబినేట్ ఆమోదం తెలపడాన్ని వ్యతిరేకిస్తున్నట్లు ఆయన తెలిపారు. అలాగే విజయవాడలో శాంతియుతంగా నిరసన తెలుపుతున్న అఖిలభారత జేఏసీ చైర్మన్ ఉప్పులేటి దేవీశ్రీప్రసాద్‌ను అరెస్టు చేయడాన్ని ఖండిస్తున్నట్లు తెలిపారు. ఈ నెల 23 తర్వాత జేఏసీలతో చర్చించి భవిష్యత్ కార్యాచరణ రూపొందిస్తామని తెలిపారు.

పేదల బియ్యం పక్కదారి

- కర్ణంవారిపల్లె రేషన్‌షాపులో అక్రమాలు
- తహసీల్దారుకు ఫిర్యాదు చేసిన గ్రామస్తులు



తహసీల్దార్‌కు ఫిర్యాదు చేస్తున్న కర్ణంవారిపల్లెకు చెందిన మల్లికార్జున

కలసపాడు : పేద ప్రజలకు అందాల్సిన రేషన్ బియ్యాన్ని యథేచ్ఛగా కొల్లగొడుతున్నారు. మండలంలోని కర్ణంవారిపల్లె రేషన్ షాపు నంబర్ 6లో కొంతకాలంగా జరుగుతున్న ఈ అక్రమాలు బయట పడడంతో మండల రెవెన్యూ అధికారులు విచారణ చేపట్టారు. కర్ణంవారిపల్లెలో 14 మంది అంత్యోదయ కార్డుదారులకు ప్రతి నెల 35 కేజీల చొప్పున 490 కేజీలు, గ్రామంలో నివాసం లేని 18 మంది రేషన్ లబ్ధిదారులకు 160 కేజీలు కలిపి మొత్తం ప్రతి నెల 650 కేజీల రేషన్ బియ్యాన్ని డీలర్, వీఆర్ఓ కలిసి స్వాహా చేశారు. స్థానికులు తహసీల్దారుకు ఫిర్యాదు చేయడంతో ఈ ఘటన వెలుగులోకి వచ్చింది. రేషన్‌షాపు పరిధిలోని కర్ణంవారిపల్లె, ముద్దిరెడ్డిపల్లె గ్రామాలకు చెందిన ఆరుగురు మూడు సంవత్సరాల క్రితం మృతిచెందారు. ప్రతి నెల వారి బియ్యాన్ని వీఆర్ఓ సహకారంతో డీలర్ స్వాహా చేసి లబ్ధి పొందుతున్నాడు. రేషన్‌షాపుపై మండల రెవెన్యూ అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో డీలర్ ఇష్టారాజ్యాంగా వ్యవహరిస్తూ ప్రభుత్వం అందించే రేషన్ బియ్యాన్ని పక్కదారి పట్టిస్తున్నారు. ఇప్పటికైనా రెవెన్యూ అధికారులు స్పందించి అక్రమాలకు పాల్పడిన రేషన్‌షాపు డీలర్‌ను తొలగించి డీలర్‌కు సహకరించిన గ్రామ రెవెన్యూ అధికారిపై చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. ఈ విషయంపై తహసీల్దారు మధురవాణిని వివరణ కోరగా వీఆర్ఓలు, రేషన్ డీలర్లలకు సమావేశాలు నిర్వహించి అవినీతికి పాల్పడవద్దని హెచ్చరించామని తెలిపారు. అయినా కొందరు అవినీతికి పాల్పడుతున్నారని చెప్పారు. ఈ విషయం తమ దృష్టికి వచ్చిందని, విచారించి ఉన్నతాధికారులకు నివేదిక అందజేస్తామని ఆమె పేర్కొన్నారు.

చెక్కుచెదరని విశ్వాసానికి 'సునీత' నిదర్శనం

ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి



పోరుమామిళ్ల : చెక్కుచెదరని విశ్వాసానికి సునీతా విలియమ్స్ నిదర్శనమని ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి కొనియాడారు. ఆమె అంతరిక్ష సాహసోపేతయాత్రపై యావత్ ప్రపంచం గర్విస్తోందని పేర్కొన్నారు. 8 రోజుల్లో పూర్తి కావాల్సిన ప్రయాణం సాంకేతిక సమస్య కారణంగా 286 రోజులు సునీతా విలియమ్స్, బుచ్ విల్మోర్ అంతరిక్షంలో ఉండిపోవాల్సి వచ్చిందన్నారు. అద్భుతమైన అంతరిక్ష పరిశోధన యాత్రను విజయవంతంగా ముగించుకొని భూమి మీదకు సురక్షితంగా వచ్చిన సునీతా విలియమ్స్‌కు ఎమ్మెల్సీ అభినందనలు, శుభాకాంక్షలు తెలిపారు. అంతరిక్షంలో ఎక్కువ రోజులు గడిపిన వ్యోమగామిగా సునీతా విలియమ్స్ పేరు చరిత్రలో నిలిచిపోనుందన్నారు. భవిష్యత్‌లో ఆమె మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.

నేడు బీసీ కులవృత్తులపై అవగాహన

చాపాడు : స్థానిక మండల పరిషత్ కార్యాలయ సభాభవనంలో గురువారం బీసీ కులాలకు చెందిన కుల వృత్తులు, చేతి వృత్తుల వారికి ఆదరణ–3 పథకం క్రింద అవగాహన సమావేశం నిర్వహిస్తున్నామని ఎంపీడీఓ వీర కిషోర్ తెలిపారు. ఉదయం 11గంటల నుంచి బీసీ కులాలకు చెందిన చేతి వృత్తులు, కుల వృత్తులు గల వారందరికి వారికి సంబంధించిన పరికరాల వినియోగంపై అవగాహన కల్పిస్తామన్నారు.

కులవృత్తుల వారికి పనిముట్లు

మైదుకూరు : మండలంలోని కులవృత్తుల వారికి పనిముట్లను పంపిణీ చేయనున్నట్లు ఎంపీడీఓ కేవీ శ్రీధర్ నాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. అన్ని గ్రామాల్లో ఉన్న ఆర్థికంగా వెనుకబడిన తరగతులకు చెందిన కుల వృత్తుల వారు పనిముట్ల కోసం తమ పరిధిలోని సచివాలయాల్లో వెల్ఫేర్ అసిస్టెంట్లను కలిసి దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీఓ వివరించారు. ఈ అవకాశాన్ని కులవృత్తుల వారు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

అట్లూరు : స్థానిక మండల పరిషత్ సభాభవనంలో గురువారం ఆదరణ కిట్స్‌కు సంబంధించి కుల సంఘాలతో ఉదయం 11 గంటలకు సమావేశం నిర్వహిస్తామని మండల అభివృద్ధి అధికారి యు.భాస్కర్‌బాబు పేర్కొన్నారు. కుల సంఘాల నాయకులతో పాటు పంచాయితీ కార్యదర్శులు, వెల్ఫేర్ అసిస్టెంట్లు హాజరు కావాలని ఆయన కోరారు.

పాలిసెట్ ప్రవేశ పరీక్షకు ఉచిత శిక్షణ

మైదుకూరు : పదో తరగతి తర్వాత పాలిటెక్నిక్ కళాశాలలో ప్రవేశాల కోసం అర్హత పరీక్ష రాసే అభ్యర్థులకు ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు మైదుకూరులోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ కేవీ సుబ్బారావు ఒక ప్రకటనలో తెలిపారు. పాలిసెట్ పరీక్షను ఏప్రిల్ 30వ తేదీ రాష్ట్ర వ్యాప్తంగా రాష్ట్ర సాంకేతిక విద్య, శిక్షణ మండలి నిర్వహిస్తున్నట్టు ఆయన పేర్కొన్నారు. ఈ పరీక్షకు హాజరయ్యే వారికి తమ కళాశాలలో ఏప్రిల్ 1వ తేదీ నుంచి ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు శిక్షణ అందిస్తామని తెలిపారు. విద్యార్థులకు స్టడీ మెటీరియల్‌ను ఇంగ్లీషు, తెలుగు మాధ్యమాల్లో ఉచితంగా అందజేస్తామన్నారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు. పాలిసెట్ పరీక్షకు దరఖాస్తు చేసుకోవడానికి ఏప్రిల్ 15వ తేదీ వరకు గడువు ఉందని తెలిపారు. విద్యార్థులు తమ పదో తరగతి హాల్ టికెట్, ఆధార్ కార్డు, తమ మొబైల్ నంబర్ తోపాటు ఓసీ, బీసీ అభ్యర్థులు రూ.400, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులు రూ.100 రుసుం సమీపంలోని పాలిటెక్నిక్ కళాశాలలను సంప్రదించి దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. మరిన్ని వివరాలకు జనరల్ సెక్షన్ విభాగాధిపతి డాక్టర్ జి.హెన్రీ థామస్‌ను 8985257287 ఫోన్ నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

చెత్త సేకరణలో నిర్లక్ష్యం తగదు

ప్రొద్దుటూరు రూరల్ : పంచాయతీ సిబ్బంది ఇంటింటి నుంచి చెత్త సేకరణ చేయాలని, విధుల్లో నిర్లక్ష్యం తగదని ఎంపీడీఓ సూర్యనారాయణ రెడ్డి తెలిపారు. మండలంలోని కొత్తపల్లె, ఖాదర్‌బాద్, అమృతానగర్‌లలో చెత్త సేకరణను బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆ గ్రామాల్లోని ప్రజలతో గ్రామ పంచాయతీ సిబ్బంది ఎన్ని రోజులకు ఒక సారి చెత్త సేకరిస్తున్నారని ప్రజలను ఆరా తీశారు. ప్రజలు తడి, పొడి చెత్తలను వేరు చేసి సిబ్బందికి అందించాలని సూచించారు. వేసవి కాలంలో గ్రామాల్లో తాగునీటి సమస్య రాకుండా చర్యలు తీసుకోవాలని గ్రామ కార్యదర్శులకు ఆదేశించారు. కార్యక్రమంలో ఈఓపీఆర్డీ రామాంజనేయరెడ్డి, కార్యదర్శులు రామ్మోహన్‌రెడ్డి, సురేష్‌కుమార్ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో కానిస్టేబుల్‌కు గాయాలు



చికిత్స తీసుకుంటున్న సుమన్

ప్రొద్దుటూరు క్రైం : మండలంలోని రాధానగర్ సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో కానిస్టేబుల్ సుమన్ తీవ్రంగా గాయపడ్డాడు. రూరల్ పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. దువ్వూరుకు చెందిన కానిస్టేబుల్ సుమన్ పులివెందులలో పని చేస్తున్నాడు. బుధవారం పులివెందుల నుంచి బైక్‌లో అతను దువ్వూరుకు బయలుదేరాడు. ఈ క్రమంలో ప్రొద్దుటూరు మండలంలోని రాధానగర్ సమీపంలోకి రాగానే ఎదురుగా వస్తున్న ఆటో– సుమన్ బైక్ పరస్పరం ఢీ కొన్నాయి. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన కానిస్టేబుల్‌ను చికిత్స నిమిత్తం జిల్లా ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కాలుకు తీవ్ర గాయం కావడంతో వైద్యులు కడప రిమ్స్‌కు రెఫర్ చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సురేష్ తెలిపారు.

కడప 'ఉక్కు' కోసం ఉద్యమం



మాట్లాడుతున్న సత్యనారాయణ

ప్రొద్దుటూరు రూరల్ : కడప ఉక్కు కర్మాగారం కోసం చేసే పోరాటంలో ప్రజలందరూ భాగస్వాములు కావాలని, పరిశ్రమ ఏర్పాటు చేసే వరకూ ఉద్యమిస్తామని సీపీఎం పట్టణ కార్యదర్శి సత్యనారాయణ పేర్కొన్నారు. స్థానిక ఎన్జీఓ హోంలో సీపీఎం ఆధ్వర్యంలో ఈ నెల 26న కడప ఉక్కు ఆంధ్రుల హక్కు అనే నినాదంపై నిర్వహించే సదస్సును విజయవంతం చేయాలని కోరారు. సీపీఎం కార్యాలయంలో బుధవారం ఆయన మాట్లాడుతూ సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు ప్రభాకర్‌రెడ్డి, జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్ ఈ సదస్సుకు హాజరవుతారని తెలిపారు. ప్రొద్దుటూరు ప్రజలు, వ్యాపారులు, నిరుద్యోగులు, విద్యావంతులు ఈ సదస్సులో పాల్గొనాలని కోరారు. సమావేశంలో సీపీఎం పట్టణ కమిటీ సభ్యులు బాబు, డీవైఎఫ్ఐ కార్యదర్శి విశ్వనాథ్, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

స్నేహితుడంటూనే వైఎస్ పేరు చెరిపేస్తున్న బాబు

చాపాడు : తనకు వైఎస్సార్ ప్రాణ స్నేహితుడని పలు సభల్లో, సమావేశాల్లో, ఇంటర్వ్యూల్లో చెప్పిన సీఎం చంద్రబాబు నేడు వైఎస్సార్ జ్ఞాపకాలను చెరిపేస్తూ స్నేహం అనే పదానికి గౌరవం, మర్యాద లేకుండా చేస్తున్నారని వైఎస్సార్‌సీపీ నేత, ఏపీఎస్ ఆర్టీసీ మాజీ జోనల్ చైర్మన్ రెడ్యం వెంకటసుబ్బారెడ్డి మండిపడ్డారు. బుధవారం ఆయన మాట్లాడుతూ.. వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్, టీడీపీ వ్యవస్థాపక అధ్యక్షుడు ఎన్టీఆర్ పేరును గుర్తుకు చేస్తూ ఎన్టీఆర్ జిల్లాగా పేరు పెట్టారని తెలిపారు. అలాగే కడప జిల్లాను అప్పటి ప్రభుత్వం వైఎస్సార్ జిల్లాగా నామకరణం చేసిందన్నారు. దానిని కూటమి ప్రభుత్వం ఇప్పుడు వైఎస్సార్ కడప జిల్లాగా మార్చడం ఏమిటని ప్రశ్నించారు. వైజాగ్ క్రికెట్ స్టేడియానికి వైఎస్సార్ పేరు ఉంటే మీకేం ఇబ్బంది.. ఇలా దిగజారుడు రాజకీయాలు చేయడం తగదని హితవుపలికారు.